

# మాటా మంతీ

## -సాయి పద్మ



6

# పరదేశీపాలెం నుండి పరదేశం దాకా..

ఈ నెల నా కౌముది మాటా మంతీ అమెరికా నుండి.. చాలామంది చదివే వాళ్లకి , అమెరికా కొత్తకాదు కానీ, మాలాంటి పరదేశీలకి కొత్తే.. ! మొన్న రాసింది చదివి ఒక ఫ్రెండ్ కామెంట్ చేసింది.. " బరా బరా రాసేస్తున్నావు, టాపిక్స్ మంచివి ఎంచుకుంటున్నావు గానీ.. ఇంకొంచెం డెప్త్ లో రాయచ్చు.." అందుకే ఇవాళ పరదేశీల మీద డెప్త్ లో రాద్దామని డిసైడ్ అయ్యా.. (రాసే వాడికి , చదివేవాడు హల్కా గా కనబడతాడు అనే ప్రాథమిక సూత్రం ఆధారంగా )

వైజాగ్ లో మా ఇంటికి దగ్గరలో ఉన్న వొక ఏరియా ని పరదేశీ పాలెం అని అంటారు. అక్కడ మాకో చిన్న స్థలం ఉండేది. ఇల్లు కట్టుకోవాలని చిన్న కోరిక ఉండింది గానీ.. ఆ ఏరియా ఎక్కువ కబ్జాలు జరిగిపోతున్నాయని అయినకాడికి అమ్మేసారు! అమెరికాని కూడా మనవాళ్ళు బానే కబ్జా చేసారు అని, ఇక్కడికి వచ్చిన తర్వాత అర్ధం అయింది. నేను చెప్పలా.. ఇది యునైటెడ్ స్టేట్స్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ ..అని నవ్వారు మిత్రులు. మీ ఆఫీస్ లో తెలుగు వాళ్ళు ఉంటారా అంటే "లేదమ్మా .. ఇండియన్స్ మధ్యలో, అందునా తెలుగు వాళ్ళ మధ్యలో, అమెరికన్ల నే వెతుక్కోవాలి మనం .." అని నవ్వింది నన్ను కలవటానికి వచ్చిన మిత్రురాలు! తెలుగు జాతి మనది .. మెండుగా వెలుగు జాతి మనది ..అని చెప్పొద్దూ భలే గర్వం వేసింది!

ఇక్కడ రెండు రకాల తెలుగు వాళ్లకి కలుస్తూ ఉన్నాను.. షుమారు నలభై ఏళ్ళ క్రితం స్థిరపడి, ఈ పరదేశాన్ని , అంది వచ్చిన అవకాశాల్ని, ఇక్కడ స్నేహాల్ని రెండు చేతులతోనూ స్వీకరించి, ఈ దేశంతో మమేకమైన వాళ్ళు ఒక రకమైతే ( సౌలభ్యం కోసం వీళ్ళని సీనియర్ తెలుగూస్ అందాం) హెచ్ వన్ మీదో, ఇంకే దాని మీదో ఇక్కడికి వచ్చి సెటిల్ అయిన వాళ్ళు, ఇవాళో, రేపో ఇండియా వెళ్ళిపోతాం అనుకుంటూ .. జీతం, జీవితం ఇక్కడే ఖర్చు పెట్టేసేవాళ్ళు( వీళ్ళని జూనియర్ తెలుగూస్ అందాం)

సీనియర్ తెలుగూస్ – పరదేశంలో సాధక బాధకాలు , సంతోషాలు, గర్వాలూ , దుఖాలూ, అన్నీ చవి చూసినవాళ్ళు.. చాలా వరకూ, వచ్చినప్పుడే, ఈ దేశంతో కలసిపోవాలి అని నిర్ణయించుకొని, పూర్తి స్థాయిలో యాక్సెప్ట్ చేసిన వాళ్ళు.. కాబట్టి, చిన్న చిన్న ఆశాభంగాలు ఉన్నా, ఈ జీవితంతో పాటు పేకేజీ డీల్ లా సర్దుకుపోయిన వాళ్ళు , పిల్లలు అమెరికన్లని పెళ్లి చేసుకున్నా , ఇండియా నుంచి

తెచ్చుకున్న అల్లుళ్ళు సరిపడకపోయినా.. భారతదేశ కర్మ సిద్ధాంతం వంట పట్టించుకొని, వాటేవర్ హేపెన్స్.. హేపెన్స్ అనుకుంటూ.. మనవళ్ళ విజిట్ కోసమో, లేకపోతే ఫ్రెండ్స్ పలకరింపు కోసమో ఎదురుచూస్తూ బ్రతికేసేవాళ్ళు ..! ఈ దేశం ఇచ్చింది తీసుకున్నాం, దీనికి ఎంతోకొంత చేయాలి అనే ఒక తత్వం ఉంటుంది వీళ్ళల్లో ! ఇన్ని సంవత్సరాల తర్వాత, వేరే దేశంలో ఇమడగలగటం కూడా వీళ్ళకి సందేహమే.. ! కాబట్టి పూర్తి స్థాయి ఇండియన్ అమెరికన్ లా మారటానికి వీళ్ళ వంతు పూర్తి ప్రయత్నం చేస్తారు. వీళ్ళల్లో ఉన్న సర్వైవల్ ఇన్స్టింక్ట్ కూడా దానికి దోహదం చేస్తుంది. ఈ దేశంలో నిలదొక్కుకోవటం కోసం చేసిన ప్రయత్నాలూ, పడ్డ ఇబ్బందులూ.. వీళ్ళని బాగా సానపడతాయి. కొన్ని ఇబ్బందులు ఉన్నా, ఆర్ధికంగా వోదుడుడుకులు చూడటం వీళ్ళకి ఎసట్. వీళ్ళల్లో ఉన్న , పొదుపు, స్నేహాలని కాపాడుకొనే తత్వం వీళ్ళని సునాయాసంగా వృద్ధాప్యం దాటించగలదు.

ఇకపోతే,

జూనియర్ తెలుగూస్ – ఏ ఉద్యోగం పడితే ఆ ఉద్యోగం కాకుండా .. సలక్షణంగా , సాఫ్ట్వేర్ ఉద్యోగం తెలుగు పురుష లక్షణం అన్న టైప్ లో, మంచి జీతం, ఇల్లు దొరికేదాకా హోటల్.. ఇలా సలక్షణంగా ఈ దేశంలో వచ్చి పడ్డవాళ్ళు. ముందు, కొన్నాళ్ళు బాచిలర్ లైఫే సఫలమూ.. అని పాడుకున్నా, తెల్లారేసరికి , సీరియల్ మాత్రమే తిని కొలువుకి పోవాల్సి రాగానే, పెళ్లి చేసుకుందాం అని గుర్తొచ్చి .. మళ్ళీ తెచ్చుకున్న హెచ్ ఫోర్ పిల్ల ఇదే మొదటిసారి వంటింట్లో అడుగుపెట్టిందని తెలుసుకొని కూడా బావురుమనకుండా .. చేతులూ కాళ్ళూ జాయింట్ గా కాల్చుకుంటూన్న వాళ్ళు. పోను, పోను, ఇండియన్ రెస్టారెంట్లు పెట్టటానికి ఇది ఉపయోగ పడుతుందని కూడా మనసులో కూసంత సంతోషం ఉంటుంది లెండి. కాకపోతే, పిల్లలకి తెలుగు రాకపోయినా, తెలుగు వచ్చిన తర్వాత వాళ్లకి, కూచిపూడో, భరతనాట్యమో, కనీసం ఒక్కసారైనా 'పాడుతా తీయగా' కి సెలెక్ట్ కాకపోవటమో జరిగితే, వీళ్ళు కడు దుఃఖించెదరు. కాకపోతే అప్పుడు ఇండియాకి ఫోన్ చేసి, వాళ్ళ పిల్లో, పిల్లాడో సెలెక్ట్ కాకపోవటంలో ఎన్ని రాజకీయాలు జరిగాయో సోదాహరణంగా చెప్పగలరు. అంచనాల సమస్య ఉంటుంది వీళ్ళకి. కొన్నాళ్ళకి, ఇవన్నీ తగ్గి డాలరు మాయలో పడతారు. బాగా సంపాదించి ఇండియా వెళ్లి, పని మనుషులని పెట్టుకొని ... చల్లగా కాలం గడపాలోయ్ ఇలా ఉంటాయి ఆలోచనన.లు కానీ వెళ్ళేదెపుడో ఎవరికీ తెలీదు. అమెరికాలో ఉన్నా.. నిత్యం తమ తమ అనకాపల్లితో నిత్యం టచ్ లో ఉండే వీళ్ళు .. ఎవరైనా ఇండియా నుండి వస్తున్నారంటే ( పని చేయటానికి వచ్చే తమ తమ పేరెంట్స్ తప్ప !) కొంత బెంబేలెత్తి పోతారు. వీలున్నంతవరకూ, హడావిడిగా, వచ్చినవాళ్ళకి తమ జీవితం అర్ధం అయేలోగా వెళ్ళిపోతే బాగుణ్ణు అని మొక్కుకుంటూ ఉంటారు. పిల్లలు పెద్దవాళ్ళయితే మరో బాధ. వీళ్ళు పడే/పెట్టె బాధలు, ఆ పిల్లల ఆలోచనలు ఇలా డబుల్ డెక్కర్ సవారీలా ఎటూ చెందకుండా ఉంటాయి. తమ భారతీయత , తమ కల్చర్ ఎక్కడ భ్రష్టుపట్టి పోతుందో అన్నట్లు, శంకరశాస్త్రి లా నిత్యం నాలుగు గుళ్ళు, పదహారు ఈవెంట్ల తో పదహారణాల తెలుగు వాళ్ళు అనిపించుకుంటారు..!

ఇవన్నీ నా ఆలోచనలే సుమండీ! నేను గమనించిన విషయాలు. ఒక సీనియర్ తెలుగూస్ ని పెళ్లి చేసుకున్న ఒక డచ్ వనిత ..నాతో మాట్లాడుతూ ఇలా అంది.. " తెలుగు వాడిని పెళ్లి చేసుకొని, నేను తెలుగు సమూహాన్నే పెళ్లి చేసుకున్నట్టు అయింది.. ఎంతో మంది పరిచయం అయారు మావారి ద్వారా. కానీ, ఇప్పటి తెలుగు వాళ్ళు , ముఖ్యంగా యువతరం, ఇంత చదువుకొని, డబుల్ డిగ్రీలు సంపాదించి, సంపాదనలో ఇంత తెలివితేటలు ఉన్నవాళ్ళు, తమ, తమ బంధాలను నిలుపుకోవటంలో ఎందుకు ఫెయిల్ అవుతున్నారు? ఎందుకు ఇండియన్ రిలేషన్షిప్ కౌన్సిలర్ లకు పని పెరుగుతోంది? నాకైతే అర్ధం కాదు..! "

నాక్కూడా అర్ధం కాలేదు. నిజమే.. ఒక తరం భుజాల మీద , వాళ్ళ ఆలోచనల మీద, ఆశయాల మీద, ఇబ్బందుల మీదుగా దాటి , గ్రేట్ అమెరికన్ డ్రీమ్స్ నిజం చేసుకుంటున్న ఇప్పటి తరం .. వాళ్ళ కంటే టెక్నాలజీ తో నిరంతరం అందరితో టచ్ లో ఉండే ఈ తరం.. సంతోషంలో, నిజమైన సుఖంలో టచ్ లో ఉన్నారా..?

మీ ఆలోచనలు, అభిప్రాయాలు, నాతో పంచుకోండి.. ఇవి నా అభిప్రాయాలే.. ఇందులో నైరాశ్యం లేదు.. జీవితానుభవాల్ని, అందరూ సెలెబ్రేట్ చేసుకోవాలన్న కోరిక తప్ప.. అర్ధం చేసుకుంటారని, అపార్ధం చేసుకోరని ఆశిస్తున్నాను.

ఇంకొన్ని ఆలోచనలతో, మళ్ళీ వచ్చే నెల కలుద్దాం.. !

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments